# షెల్ఫ్‌లో కథ

కథ రాయడం పూర్తిచేసి తన పేరుపైన రాసుకుంది వర్ధని. పేరు రాస్తుంటే విపరీతమైన అసంతృప్తి కమ్మేసింది. ఆమె పేరు పూర్తిగా రాయాల్సి వస్తే పండితారాధ్యుల పర్వతవర్ధని అని రాయాలి. పొడిగా వట్టి 'వర్ధని' అందామంటే అప్పటికే వర్ధని అనే పేరుతో ఒక బ్యూటీషియన్ పత్రికల్లో దర్శనమిస్తోంది. అదీకాక మరొకామె కన్స్యూమర్స్‌కి సలహాదారినిగా మరికొన్ని పేపర్లలో కనిపిస్తోంది.

అందుకే వర్ధని రెండు మూడుసార్లు, రెండు మూడు రకాలుగా రాసి, కొట్టేసి, మళ్ళీ మార్చి మళ్ళీ చేర్చి, చివరికెలా పేరు రాయాలో తోచక, ఆ సంగతి పక్కన పెట్టేసి కథను మరొకసారి చదువుకోవడంలో పడింది. అక్కడక్కడ మెరుగులు దిద్దడం, వాక్యాలు, మాటలు మార్చడం చేస్తూ వస్తానన్న మావయ్య కోసం మనసులో ఎదురు చూస్తోంది.

వర్ధని కథ క్రితం రాత్రే పూర్తి చేసింది. వెంటనే అది మావయ్యకి చూపించి, సలహా తీసుకోవాలని తహతహలాడిపోసాగింది. ఆయనకి ఫోను చేసింది.

వర్ధని మామయ్య పతంజలి పేరు ప్రతిష్ఠలున్న రచయిత. అందులోనూ చిన్నప్పటి నుండి వర్ధనం అంటే వాత్సల్యమున్నవాడు సొంత అక్క కూతురు ముద్దుల మేనకోడలు కాకుండా సాహిత్యం అనే మాటగానీ, ఊసుగానీ ఆ కుటుంబాలలో వినిపించే కంఠం ఒక్క వర్ధనిదే. మరెవ్వరికీ ఆ వాసన బొత్తిగా లేదు. అందుకే పతంజలి వర్ధనిని అభిమానించడం ఆమెతో గంటలకొద్దీ కబుర్లు చెప్పడం.

వర్ధని చేతులు రుద్దుకుంటూ కాస్తంత ఆవేశంగా, ఆత్రుతగా మావయ్య కోసం ఎదురుచూస్తోంది. నిజానికి ఇంట్లో ఎవ్వరూ కథలు రాయొద్దనీ, కవిత్వం చదవొద్దనీ

నిర్బంధించకపోయినా అందరూ ఉండగా ఏదో అడ్డుగా అనిపించి, ఎవ్వరూ లేని ఈ రెండు రోజుల్లో ఏదో ఒకటి రాసి, ఒక ఘనకార్యం చెయ్యాలనే అనుకుంది. దాని ఫలితంగా కథ పూర్తయింది.

గేటు చప్పుడైంది. వర్ధని బయటికి బంతిలా గెంతింది.

"రా మావయ్యా-రా! అబ్బ ఎంత సేపట్నించో నీ కోసం వెయిటింగ్" అంటూ ఆనందంగా ఎదురెళ్లింది.

"ఇంకాస్త ముందుగా వచ్చేవాడినే - మధ్యలో ఎవరో తగిలి కబుర్లలోపడి ఆలస్యమైంది"

"ఫర్లేదులే - మంచినీళ్ళు తీసుకో"

"అయితే అమ్మ ఢిల్లీ వెళ్ళిందా"

"ఆ... అక్కని తీసుకురావడానికి"

ఇద్దరి మధ్యా ఇతర మాటలు అయిదు నిముషాలు సాగాయేమో, వర్ధని కథ రాసిన కాగితాల బొత్తి పతంజలి చేతిలో పెట్టింది.

"నీకు మంచి కాఫీ కలిపి తెస్తాను" అంటూ లోపలికెళ్ళింది.

పతంజలి కథ కాగితాలవైపు చూసి

"పి.పి., వర్ధనేమిటే, పక్కవాళ్ళు టెలిఫోన్ నెంబరు ఫ్రండ్సుకిచ్చినట్టు" అన్నాడు.

"అది వదిలేయ్ మావయ్యా, ముందు కథ చూడు" అంటూ లోపల్నించే కేక పెట్టింది.

పొగలు కక్కే కాఫీ కప్పుతో నెమ్మదిగా నడచి వస్తున్న మేనగోడల్ని నిశితంగా చూస్తుండిపోయాడు పతంజలి.

"అమ్మాయీ, కాఫీ ఎలాగూ బాగుంటుంది. పైగా ఇప్పుడే డికాక్షన్ వేసినట్టున్నావు. కానీ కథేమీటింత బాగా రాశావు" అన్నాడు. అతని మాటల్లో మెచ్చుకోలు స్పష్టంగా కనిపిస్తోంది.

వర్ధని ముఖం ఆనందంతో వెలిగింది. అంతలోనే కొంచెం సిగ్గుతో కళ్ళు దించుకుంది.

"పొగడ్త కాదు మావయ్యా నాకు కావల్సింది. ఘాటైన నీ అభిప్రాయం".

"బాగుంది అంటే అది ఘాటైన అభిప్రాయం కాదా? నిజంగానే బాగుంది. అదే అన్నాను. అబద్ధం చెప్పమంటే చెప్తాను. చెత్తగా ఉందని - నాకేం?" అన్నాడు నాటకీయంగా చేతులు తిప్పుతూ.

"కాదులే. నేనిది పబ్లిష్ చెయ్యచ్చా"

"ఓ... భేషుగ్గా చెయ్యవచ్చు" అని కాస్సేపాగి అయితే దానికి కొన్ని హంగులు కావాలి" అన్నాడు సాలోచనగా.

"ఏమిటి"

"నీ పేరు చాలా మోడరన్‌గా ఉండాలి. ఇలా పర్వత వర్ధనీ మంగతాయారు, సోమిదేవమ్మ, రామసోదెమ్మా - సూర్యకాంతం- శూర్పణఖ పేర్లు పనికి రావు. అవి కనిపించగానే నీ మీద సంప్రదాయ ముద్ర వేసి, మూల కూర్చోబెడతారు"-

"వ్వాట్"

"ఆగు కంగారుపడకు పేరుదేముంది ఓ మంచి పెన్నేమ్ సంపాదిస్తే సరి"-

"అబ్బ, అస్తమానూ అందరికీ ఆ పెన్నేమ్ నాదే - అది నేనే రాశాను అంటూ డబ్బా కొట్టుకోవాలి" అంది విసుగ్గా-

"అదేం డబ్బా? అసలు డబ్బా చెప్తా విను. ఒకటి పేరు కదా తీసేయ్, రెండోది ఓ - మాంచి ఘరానాగా ఉన్న ఫోటో ఒకటీ తీయించుకుని జత చెయ్యాలి"

"అంటే"

"ఆ ఫోటో చూడంగానే అవతలివాడ్ని నువ్వు వట్టి వెధవ్వి - బోడివి అని తిడుతున్నట్టుగా ఉండాలి. చూసేవాడు కాస్త జంకాలి"

వర్ధని నోరు తెరిచి చూస్తుండిపోయింది. అతని మాటలు సీరియస్‌గా అంటున్నాడో, వ్యంగ్యమో అర్థం చేసుకునే ప్రయత్నంలో ఉంది.

"ఇంకా విను. ఎడిటర్స్‌ని కలిసి కళ్ళల్లో కళ్ళు కలిపి మాట్లాడాలి. దబాయించాలి. చివరికి ఎడిటర్ సొంత కారులో నిన్ను ఇంటికి డ్రాప్ చేసేలా చెయ్యాలి"

"ఛా! చాల్లే ఇవేం హంగులు. నన్నో వెర్రిదాన్ని చేస్తున్నావు. నువ్వింత రచయిత వయ్యావు ఇవన్నీ చేశావా"

"అయ్యో తల్లీ! ఆ రోజులు, ఆ పద్ధతి వేరు. పోస్టులో కథ పంపటమే గానీ ప్రయిజు వస్తే గానీ ఫోటోనే ఎరుగం"

"మరి?"

"కాలం మారింది. అందుకే యంగ్, బ్యూటిఫుల్ రచయిత్రి బొమ్మ ప్రతి పేజీలోనూ ఉండాలి"

"ఏమిటి మావయ్యా! నాకు రచన చేయడం మీద ఆసక్తి ఉంది. నిజమే! అది పబ్లిషయి అందరూ చదవాలనే ఆశ కూడా ఉంది. నిజమే. కానీ ఈ నెట్‌వర్క్ నా వల్ల కాదు."

"అయితే కష్టమే"

"ఏమిటి కష్టం? ఇందాకట్నించి చూస్తున్నాను. నీ యిష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నావు ప్రతిభ ముఖ్యమా - ప్రదర్శన ముఖ్యమా!"

"ప్రస్తుతం ప్రదర్శనే ముఖ్యం. నువ్వు ఈ చీర కట్టుకోవడం మానేసి స్కర్టు వేసుకుని లూజుగా ఉన్న అమెరికన్ షర్టు వేసుకుని, జుత్తు బాగా కత్తిరించుకుని, బొట్టూ, కాటుక, గాజులు, గొలుసులు లాంటివి లేకుండా వెళ్ళావంటే నిన్ను వెంటనే మాదరన్ లేడీగా గుర్తించి ముందు నిన్ను ఎత్తి అందలం ఎక్కిస్తారు. నువ్వంటే కాస్త భయపడతారు. దానికి తోడు నువ్వు కాస్త నోరు పారేసుకోగలిగితే నీకింక తిరుగుండదు" పతంజలి మాటలు ఆపాడో లేదో వర్ధని అతని మీద విరుచుకుపడి, కొట్టినంత పని చేసింది.

"ఏదో మంచి సలహా లిస్తావనుకుంటే - ఛీ, అసలు టాలెంట్‌కి విలువ లేదని తేల్చావు - అచ్చం మగాడిననిపించావు" అంటూ విసవిసలాడింది.

"అబ్బే! ప్రతిభకు విలువ లేదని కాదుగానీ యివన్నీ దానికి భూషితాలు - అంటే - పైసంత ప్రతిభ ఉంటే రూపాయంత ఖ్యాతి వస్తుందన్నమాట" తేల్చాడు.

"నాకేం అక్కర్లేదు"

"అయితే గొడవే లేదు - ఇదిగో చూడమ్మాయ్ ఇవన్నీ పైకి వేషలే. మళ్ళీ వెనకాల మామూలే" మీరు బ్రాహ్మలేనా - నియోగులా - కాసల్నాట్లా - అరె, ఆయన కమ్మవారనుకున్నానే - అరె శర్మ అని ఉంటే బ్రాహ్మడనుకున్నానే కాదా - అంటూ టెలిఫోన్ టాక్స్ సాగుతూనే ఉంటాయి - చివరికి అయినా ఎవరైనా మనకేం లెండితో ముగిస్తుంటారు. ఇది ప్రస్తుతం నడుస్తోంది. మార్పు వేషభాషల్లోనే కానీ మనస్సుల్లో, ఆలోచనల్లో అస్సలు లేదు. దీనికి అనుగుణంగా నడవలేకపోయినా నష్టం ఏమీ లేదు. కాకపోతే కాస్త వెనుకబడి ఉంటావు. ఎవరా పండితారాధ్యుల పర్వతవర్ధని మహాపాత చింతకాయ పచ్చడి ఉండే - ఇంత బాగా ఆమేం రాస్తుంది అన్నా అంటారు. నేను మీ మావయ్యనని తెలిస్తే నేనే రాసి నీ పేరెట్టానని కూడా అనగలరు"

"చాల్లే చాలు. పెద్దగా చెప్పొచ్చావ్ - లోకం మరీ అంత దరిద్రంగా ఏమీ లేదు"

"నిజమే, నువ్వలా అనుకోవడమే మంచిది లేకపోతే నువ్వేం రాయగలవు?"

"అవును మావయ్యా స్త్రీవాద ప్రభ ఇలా వెలిగిపోతుంటే నువ్విలా రచయిత్రుల గుణగణాల్ని విమర్శించటం, ఎద్దేవా చేయడం నాకేం బాగా లేదు - నిజమేలే - నువ్వూ మగాడివేగా మరి".

"మరి- నేనూ మగాడినే - మొన్నొక ఫెమినిస్టు నాకు చెప్పింది గర్వంగా, తనెప్పుడూ వంట చెయ్యదుట! "నేను వచ్చానని (మాడ్చిన) అరటికాయ వేపుడుతో అన్నం వండి పెట్టిందట. అంటే ఆమె చేతి వంట తినే అదృష్టం నాకొక్కడికి పట్టిందట".

"ఆహాఁ..." పతంజలి నవ్వుతో హాలు దద్దరిల్లింది.

"చాల్లే- మీరంతా ఆడవాళ్ళని ఆడిపోసుకోవడంలోనూ అవహేళన చెయ్యడం లోను ముందుంటారు. ఏం? ఆడవాళ్ళు వంట చెయ్యకపోతే తప్పా? ఎప్పుడూ వాళ్ళే వంట యిళ్ళల్లో మగ్గిపోవాలా" వర్ధని ఛాలెంజ్‌గా అడిగింది.

"వద్దు తల్లీ వద్దు. వాళ్లేం చేయద్దు. మమ్మల్నిలా బతకనిస్తే చాలు"

"మిమ్మల్నెవరూ తినేయడం లేదుగానీ మీరే పైకి స్త్రీలను ప్రోత్సహించినట్లు నటించి వెనక్కి తిరగ్గానే తాటాకులు కడతారు".

"ఏం చేస్తారు? మిమ్మల్ని మేం కాపాడుకోవాలి కదా - స్త్రీ వాదాన్ని పూర్తిగా సపోర్టు చేస్తే ఇంట్లో అంట్లుతోమి, వంట చెయ్యాలి"

"చెయ్యండి. ఇన్ని యుగాలుగా ఆడవాళ్ళు చేస్తున్న పని. ఇప్పుడు మీరు చెయ్యి మార్చుకుని చేస్తే తప్పేంటి?"

"తప్పేమీ లేదు చేతులు కాల్తాయనీ..." మావయ్య నవ్వు చూస్తే వర్ధని ఒళ్ళు మండిపోయింది.

మగవాళ్ళు వ్యంగ్యం పేరుతో, జోక్ పేరుతో వాళ్ళ మనసులోని భావాలు యిలాగే వెళ్ళగక్కుతారు ఆడవాళ్ళు సీరియస్ అయి బాధపడితే సెన్సాఫ్ హ్యూమర్ లేదంటారు - వీళ్ళూ వాళ్ళతో కలిసి నవ్వేస్తే, వాళ్ళనదల్చుకున్నవి అనేస్తారు.

ఇప్పుడిప్పుడే ఈ సంగతి వర్ధనికి అర్థమవుతోంది. ఇద్దరి మధ్యా వాదోపవాదాలు తర్వాత, తన కథ తప్పక పబ్లిష్ అవుతుందని చెప్పాక వర్ధని సంతృప్తి పడింది, పతంజలి ఛలోక్తులుగా మాట్లాడినా, ఆ మాటలు ఆమెని కలతపెట్టాయి. సగం ఉత్సాహం చల్లారింది. అయినా ఎలాగైనా తనకథ పబ్లిషయితే బాగుండననుకుంది.

ఆ కథని అప్పటికి షెల్ఫ్‌లో పడేసింది.

❖ ❖ ❖

వేరే పనుల్లో పడి కథ గురించి కొన్నాళ్ళు పట్టించుకోలేదు. ఓ రోజు తన అశ్రద్ధకి నొచ్చుకుని మొదటి ప్రయత్నంగా ఫోటో స్టూడియోకి వెళ్ళి ఫోటో తీయించుకొచ్చింది. గుండ్రంగా ముఖం - పెద్ద పెద్ద కళ్ళు - నుదుటి మధ్య చిన్న బొట్టు - చెవులకి ఒంటి రాయి కింద ముత్యం డ్రాప్ - ఏమైనా తనకి తనే నచ్చలేదు. గరానా తనం ఉంటే కదా ఫోటోలో పడడానికి - దానికి తనేం చెయ్యగలదు?

కథ కవరులోనే ఫోటో కూడా పెట్టేసి, ఆ కవరు షెల్ఫ్‌లో పడేసింది.

వర్ధన్ని రకరకాల ఆలోచనలు బుర్ర తొలిచేస్తున్నాయి. అన్ని రంగాలలోను స్త్రీలు ముందంజ వేస్తున్నారని తెల్లారి లేస్తే ఒకటే ఘోష. కానీ అదెంతవరకు నిజం? మావయ్య చెప్పిన మాటల్లో నిజం లేదా? ఆ మాటలు పూర్తిగా కొట్టిపారేయగలదా? స్త్రీలను ముందుకు తోసినట్టే తోసి వెనకెన్ని మాటలు మాట్లాడుతున్నారు. చిత్రమేమంటే ఒకామె దగ్గర మరొకామె గురించి హేళన చేస్తుంటే ఆమె హాయిగా, సంతోషంగా ఎంజాయ్ చేస్తుంది. ప్రతి రచయిత్రీ మరొక రచయిత్రి గురించి చులకనగా మాట్లాడుతుంది. ప్రతిభలో పోటీపడకుండా పబ్లిసిటీలో పోటీపడుతుంది. ఇదే మగవారికి అలుసు. అందుకే వారి గేమ్ సులువుగా ఆడి ఆనందిస్తుంటారు.

ఇంటికెవరేనా వస్తే మంచినీళ్ళిచ్చి కాఫీ కలిపి యిచ్చి, భోజనం చేసి వెళ్ళండి అంటే ఆ స్త్రీ చచ్చినా ఫెమినిస్టు కావడానికి వీల్లేదుట.

ఇంటికెవరేనా వస్తే వాళ్ళతో తనూ బయటకెళ్ళి హోటల్లో తిందాం అంటే ఆమె అసలు సిసలు స్త్రీ వాదట".

"ఇవన్నీ పతంజలి చెప్తుంటే వర్ధని విని కుతకుత ఉడికిపోయింది. కానీ ఈ విధమైన ఇంప్రషన్ యిస్తున్నది స్త్రీలే అన్నది కొంతవరకు నిజం అనే విషయాన్ని పూర్తిగా కొట్టిపారేయలేకపోతోంది.

మావయ్య కూడా దొంగే - అవును. మావయ్య కూడా మగాడే - ఆడాళ్ళంటే అందుకే అంత చులకన.

ఎలాగైనా తమ టాలెంట్ మీద ఆధారపడి పట్టుదలగా రచనలు చెయ్యాలి అనుకుంది వర్ధని.

సొంత ఆలోచన ఉన్న స్వతంత్రత కోరుకునే స్త్రీని మగాడే మనలేడు. అందులోనూ సొంత స్త్రీ అయితే మరీను. మొన్న నెవరో జోక్ చేస్తున్నారు. న స్త్రీ స్వాతంత్ర్య మర్హతి అంటేట - అక్కడ స్త్రీ అనే చోట సొంత (భార్య) అని సరిదిద్దితే చాలుట - తన భార్యకి - తప్ప మిగిలిన అందరికీ స్వతంత్ర్యం ఉన్నా ఫరవాలేదుట.

❖ ❖ ❖

కొత్తగా పెట్టిన ఒక వారపత్రికను పతంజలి ఎడిటర్‌గా అయ్యాడు. అతనంత మంచి పొజిషన్‌లోకి వచ్చినందుకు వర్ధని ఎంతో పొంగిపోయింది. తనకింకేం కావాలి? మావయ్య నుంచి వచ్చే ప్రోత్సాహం తల్చుకుని, ఊహించుకుని మరీ ఆనందపడి పోయింది. పైగా పత్రికారంగంలో ఉండే అవకతవకలు మావయ్య బాగా విమర్శించే వాడు. కనుక వాటిని పక్కకి పెట్టి ప్రతిభకు చోటిస్తాడు – అదీ ఆమె ఆనందం.

పతంజలి ఎడిట్ చేసిన పత్రికల్లో ఆదర్శాలు కనిపించకపోయినా, గరాజా ఫోటోలు అవీ మామూలుగా ఉన్నా, మొత్తానికి బాగుందని ఆనందిస్తూ, రెండో ఇష్యూ వాటికి తన కథ తీసుకెళ్ళింది వర్ధని.

పతంజలి ఎడిటర్ మాస్క్‌లో దర్జాగా కూర్చుని ఉన్నాడు. మేనకోడలి కథ తీసుకుని, టేబుల్ మీద పెట్టి.

"నేను నీ మావయ్యనని అందరికీ తెలుసు. మొదట్లో నేనీ కథ వేస్తే బంధుప్రీతి అనుకుంటారు" అన్నాడు.

వర్ధనికి పౌరుషం తన్నుకొచ్చింది. "ఇది మంచి కథ అన్నావుగా" అంది.

"నిజమే...కానీ..." తేల్చి చెప్పలేకపోతున్నాడు.

వర్ధని వచ్చేసింది. ఇంటికొస్తూనే ఆ కథని షెల్ఫ్‌లో పడేసింది.

(ఆంధ్రజ్యోతి డైలీ, 17 మే 1998)